# పునః ప్రభాతం: అరవింద

కథానిక

ఉమాదేవి

సుప్రసిద్ధ రచయిత్రి అరవింద వివాహం మహా వైభవంగా బంధుమిత్రుల సాన్నిధ్యంలో రాత్రి 10–15 గంటలకు శాస్త్రోక్తంగా సలక్షణంగా జరిగిపోయింది. వెటర్నరీ డాక్టరు శేషాద్రి ఆమె సుందర గళసీమలో మంగళసూత్రాన్ని కట్టి మృదువుగా మూడు ముళ్ళూ వేశాడు ... చూడవచ్చిన పెద్దలు పదికాలాల పాటు పచ్చగా వర్థిల్లమని ఆశీర్వదిస్తూ అక్షింతలు చల్లారు. వివిధ పత్రికల సంపాదకులూ, ఆమెను అభిమానించే పాఠక మహాశయులూ అభివందన పరంపరలను తంతులద్వారా, లేఖలద్వారా అందజేశారు... బంధుమిత్రు లెన్నెన్నో వస్తువులు బహూకరించారు. ఇదంతా చూసి వరుడు శేషాద్రి తన్మయత్వం చెందాడు.

• • •

పదెకరాల పల్లపుభూమి ఉన్న ఖామందు జగన్నాథరావు. గ్రాడ్యుయేటు అయిఉండీ ఒకరి క్రింద ఉద్యోగం చేయనని పంతంతో పాటు హాలంపట్టి స్వంత సేద్యం చేస్తూ పొలం ఉన్న గ్రామంలోనే చక్కని డాబా కట్టుకుని అన్ని వసతులూ అందులోనే అమర్చుకుని అనుభవిస్తూ ఉన్న అదృష్టశాలి. ఆమాటకొస్తే ఆగ్రామంలో నూటికి తొంభైమంది అంతా అలాంటిరైతులే! బాగా చదువుకుని వ్యవసాయాన్ని అభివృద్ధికరమైన నూతన పద్ధతుల్లో చేసుకుంటూ గ్రామసౌభాగ్యాన్ని గ్రామంలోనేఉండి కాపాడుకోవాలనే ఆదర్శవ్యక్తులు. అంతా విశాలమైన పెద్దమేడలూ భవంతులూ కట్టుకున్నారు. ఇంటి చుట్టూరా తోటలు పొలాల్లో పండే ధాన్యాలు యింట్లో గాదెలు నింపుతోంటే గడ్డిగాదం పశుగ్రాసం — హాయిగా పాడీపంటా అనుభవిస్తూ గ్రామంలో ప్రశాంత జీవితంలోని మాధుర్యం ఆస్వాదిస్తూ ఉంటారు. ఇంటింటికీ రేడియోలు. మరి కాస్త డబ్బు కూడబెట్టినవారు కారుకూడా కొనుక్కుంటారు. అదే ఐదారుమైళ్ళలో ఉన్న బస్తీలో టాక్సీగానూ తిరుగుతూ ఉంటుంది. ఇటు అవసరం వచ్చినప్పుడు స్వంతవారు బస్తీకి వెళ్ళి రావటానికి ఉపయోగపడుతుంది. చాలామంది పల్లెటూళ్ళవారిమల్లే ఇక్కడివారికి డబ్బు సంపాదించటమేకాక దాన్ని మానవ జీవితానికి ఆనందానికి ఎలా ఖర్చుపెట్టుకోవాలోగూడా తెలుసు. తమ ఆడపిల్లల్ని బాగా చదివిస్తారు...అన్నట్లు యిప్పుడిప్పుడే గ్రామస్తుల కృషివల్ల ఆ గ్రామంలో విద్యుచ్ఛక్తి కూడా వచ్చింది. ఇళ్ళూ వీధులూకూడా విద్యుద్దీపాలలో కళకళ్ళాడి పోతుంటాయి. ఆగ్రామాన్ని గనక చూస్తే మన భారతదేశంలోని గ్రామాలన్నీ ఇలా ఉంటే యిక కొదువ ఏముంది అనిపిస్తుంది.

అలాంటి భాగ్యశాలే జగన్నాథరావుగూడా. భార్య మరణించి పది పన్నెండేళ్ళయి పోయినా ఉన్న ఒక్కకొడుకునీ చూచుకుంటూ మళ్ళీ పెళ్ళిమాట తలపెట్టకుండా రోజులు గడుపుతున్నాడు, వస్తుతహా మితభాషి. "ఇతరుల జోలి నాకు పట్టదు" అనుకునే రకం ... ఎవరైనా తండ్రులూ కొడుకులూ సంఘర్షణ పడ్డారని వింటే మనసులో వణికిపోతాడు. పైకి తేలిగ్గా నవ్వేస్తాడు. "ఏం బాబాయ్ - నవ్వుతున్నావు" అని

గనక ఏ నాగులులాంటి వాడో అడిగితే "మరేం చెయ్యాలిరా నాగులూ-అసలు తండ్రీ కొడుక్కీ తగాదా ఎందుకొస్తుందంటావు? ఒకరన్నమాట మరొకరు ఒప్పుకోకపోతేకదా ... ఎవరో ఒకరు తగ్గుతే యిక తగాదా దేనికి?" అంటాడు.

తనకొడుకు తనమాటే వింటాడని ఆయనకు దృఢమైన విశ్వాసం. కాకపోయినా కొడుకుని నొప్పించేపని చేయటం ఆయనకు సుతిరామూ యిష్టంలేదు... శేషాద్రిరావయినా తండ్రి మాట దాటేవాడుకాదుగా. తెలివైనవాడూ భయస్తుడూను. తల్లిపోయినప్పటినుంచీ తల్లీ తండ్రీకూడా తనేఅయి అడిగినప్పుడు అన్నంతోకూడా కలిపి తినిపించిన "నాన్న" అంటే అపారమైన ప్రేమా అచంచల గౌరవమూ అతనికున్నాయి... నాన్న నడక్కుండా సినిమాకగూడా పోడు. అయితే ఊరిలో కుర్రసజ్జంతా "మహాబుద్ధిమంతుడు వెలిశాడోయ్" అని శేషాద్రిని ఉలికించి ఏడిపిస్తూ ఉంటారు. పెద్దవాళ్ళు 'మా శేషాద్రి సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే' అని ముసిముసిగా నవ్వుతూ ఆశీర్వదిస్తూ ఉంటారు మనసుల్లో.

కొడుకు యింటరు పేసయాక ఏంచదివించనా అనుకున్నాడు జగన్నాధరావు. 'ఏం చదవాలని ఉందిరా నాన్నా' అని అడిగాడు కుమారరత్నాన్ని.

ముద్దు ముద్దుగా మాటలొచ్చి నప్పటినుంచీ 'డాక్టరవుతాను-సూదులు గుచ్చుతాను - మందులు పోస్తాను' అంటూఉండేవాడు శేషాద్రి. అందుకని అటు ఎం.బి బి.ఎస్.కీ యిటు వెటర్నరీకోర్సుకీగూడా దరఖాస్తులు పడేశారు. కాగా రెండోదానిలోనే వచ్చింది సీటు. ఏదోఒకటి డాక్టరు కోర్సేగదా అని తృప్తిపడ్డాడు శేషాద్రి. జగన్నాధరావేగనక గట్టిగా ప్రయత్నం చేసిఉంటే ఎం. బి. లో సీటు దొరకటం ఏమంత అసాధ్యం అయిఉండేదికాదు గాని అలాంటి డొంక తిరుగుడు వ్యవహారాలు ఆయనకు గిట్టవుమరి. ఉద్యోగం చేస్తేగాని గడవదు అనే పరిస్థితికూడా కాదాయె తమది. ఏదో కొడుకు డాక్టరవాలి అని ఉబలాటపడుతున్నాడు అనే తనూ చదివించాలనుకున్నాడు.

* * *

అదుగో యిదుగో అని శేషాద్రిరావు చదువు పూర్తిచేసుకుని వచ్చాడు. ఇక ఉన్నదల్లా వాడి పెళ్ళి సమస్యే...అదీతీరి కోడలు యింటికి వస్తే తనబాధ్యత అయిపోతుందిగదా అనుకుంటున్నాడు జగన్నాధరావు...కొడుకు ఎవరిగన్నా వరించి ఉంటే ఆ పిల్లనిచ్చి చేయటానికి తాను అభ్యంతర పెట్టదలుచుకోలేదు. అభ్యుదయవాది కాబట్టి కట్నం దమ్మిడీ తీసుకోకూడదని మొదటే అనుకున్నాడు. ఇంతకీ శేషాద్రి మనసెలా ఉందో తెలుసుకోవాలిగా ముందు.

మెడికల్ కాలేజిలో చేరాక శేషాద్రికి పత్రికలూ నవలల మీదకు దృష్టి మళ్ళింది. పాఠ్య గ్రంథాలన్నీ శ్రద్ధగా చదివిన తరువాత రిక్రియేషన్‌కు తెలుగు పత్రికలూ నవలలూ తెచ్చుకుని చదివేవాడు. స్త్రీల పేర్లతో వచ్చే రచనలు ముఖ్యంగా మరింత శ్రద్ధతో చదివేవాడు. ఆడదాని హృదయం అగాధమని ఎవరో తోటివారు వాదించగా విన్నాడు. అందువల్ల వారి రచనలద్వారా వారి భావాలు గ్రహించవచ్చునని నిశ్చయించుకున్నాడు.

నిజానికి అతనికి పదేళ్ళు వెళ్ళీవెళ్ళక ముందే తల్లిపోయింది. ఇటు తోబుట్టువులూ ఎవరూ లేరు. అందువల్ల స్త్రీలతో అట్టే పరిచయం లేదు. అమ్మాయిలంటే జంకే అబ్బాయిలలో అతనొకడు. ఒకానొక ముహూర్తంలో అతని హృదయంలో ఒక రచయిత్రిని తాను పెళ్ళాడగలిగితే బాగుండు ననే కోరిక ఉదయించి రానురాను దృఢతరం అవ నారంభించింది. అతనికి సాహిత్యమంటే ఎంతో అభిమానం. తానూ ఓ పిల్లరచయిత అవాలని ప్రయత్నించాడుగాని అతడు పంపిన నాలుగైదు రచనలూ వెనక్కి వచ్చాయి— అంతటితో ఆ ప్రయత్నంనుంచి తెలివిగా తప్పుకున్నాడు. లలిత కళలంటే అతనికి ఎంతయిష్టమో అవి యితనినుంచి అంతదూరానికి తొలిగిపోయాయి.

* * *

ఆఖరు సంవత్సరం పరీక్షలు వ్రాసి యింటికి వచ్చిన మరునాడు తండ్రీ కొడుకులు భోజనాలయ్యాక మేడమీద గదిలో పడుకున్నారు. బైట పడమటి శాంబరం తీవ్రంగా కొడుతోంది. తడిసిన వట్టివేళ్ళ తడికల్లోంచి వచ్చే చల్లని గాలి ప్రాణాన్ని ఎటో తీసుకుపోతోంది. శేషాద్రి ఏదో పత్రిక చదువుకుంటూ పడకకుర్చీలో మేను వాల్చాడు. జగన్నాధరావు, ఉయ్యాల బల్లమీద

కూర్చుని చుట్ట చుట్టుకుంటూ తానడగబోయే ప్రశ్నకు ఉపోద్ఘాతం ఎలా మొదలెట్టాలా అని తికమకపడుతున్నాడు. ఎంతయినా తనంతవా డయ్యాడా తన కొడుకు.

"ఏరా నాన్నా... ఇక నీ చదువు అయిపోయి నట్టేగా."

"అవును నాన్నా" ముక్తసరిగా జవాబిచ్చాడు శేషాద్రి.

"మరి పెళ్ళి విషయం ఏమాలోచించావు" అని మెల్లిగా అన్నాడు జగన్నాధరావు.

"నాకేం తెలీదునాన్నా" బోలెడంత సిగ్గుపడి పోయాడు శేషాద్రి వట్టి అమ్మాయిలా.

తాపీగా చుట్ట ముట్టించి, "ఆ బాధ్యత నీకే వదలాలనుకున్నాను. ఈ రోజుల్లో తండ్రులు సంబంధాలు తేవటం—కుర్రాళ్లు వద్దనటం మొదలు గాగల ఘర్షణలు నాకు నచ్చవు... మనతో సంబంధం కలుపుకోవాలని వచ్చిన వాళ్ళందరి తోనూ ఈ మాటే చెప్పాను.... నీకు యిష్టమైన పిల్లను కట్నంతో ప్రమేయం లేకుండా చేస్తాను - ఏమంటావు?" గంభీరంగా 'యీ మాటలనేసి చుట్ట పొగలోంచి కొడుకు ముఖ కవళికలను ఓరచూపులతో గమనిస్తున్నాడాయన.

"నీ యిష్టప్రకారం చేయినాన్నా... నాకేం తెలుసు" మళ్ళా పత్రికాపఠనంలో పడ్డాడు శేషాద్రి.

తేలికైన హృదయంతో ఆలోచిస్తున్నాడు జగన్నాధరావు. పైకి తన యిష్టప్రకారమే అన్నా లోపల వాడు తన పెద్దరికం ఎక్కడ నిలవక పోతాడో అని జంకుతూనే ఉన్నాడు యిప్పటి దాకా. అప్పుడే యీ ఐదారు నెలల్లో ఎన్నో సంబంధాలు వచ్చాయా మరి. తన దగ్గరికి వచ్చిన సంబంధాలన్నింటినీ సింహావలోకనం చేయటం మొదలు పెట్టాడు జగన్నాధరావు. పాలకొల్లులో ఉన్నపిల్ల బాగానేఉన్నా ఏమీ చదువుకోలేదట. వేమవరంలో డాక్టరుగారమ్మాయి బి. యే. పాసయిందిగాని ఏమీ బాగుండదట. ఆ లెక్కని వీళ్ళంత ఎక్కువ ఆస్తి లేకపోయినా కాకినాడలో ప్లీడరుగారి రెండో అమ్మాయి అన్ని విధాలా తగిన సంబంధమనిపించింది.

"నాన్నా—"

ఉలిక్కిపడి "ఊ"అన్నాడు శేషాద్రి.

"కాకినాడలో ఒకమ్మాయిఉందిరా" లౌక్యంగా ప్రారంభించాడు తండ్రి.

"ఊఁ"

"లిటరేచర్ గ్రాడ్యుయేటుట."

"ఊ—"

"కాస్తో కూస్తో సంగీతం గూడా వచ్చుట"

"ఊ"

"పిల్ల బాగానే ఉంటుందిట."

"ఊఁ"

"వెళ్ళి చూచివద్దామా."

"నే నెందుకు నాన్నా—నాకు తెలీదు నీవే వెళ్ళరాదూ"

"అదేమిట్రా రేపు పెళ్ళి చేసుకుని కాపురం చేసేది నేనా?"

"అవును—ఊ" పరధ్యానంగా యిందాక చెప్పి నట్లు దీనికీ పైజవాబే యిచ్చాడు.

"ఊ ఏమిటో పైగా - నేను చెప్పేవి వింటు న్నావా?" అని గట్టిగా అడిగాడు జగన్నాధరావు.

కంగారుగా పత్రిక టేబిల్ మీద పడేసి సరిగా కూర్చున్నాడు శేషాద్రి.

"కాదునాన్నా..."

"ఏది కాదు? పిల్లని చూట్టానికి వెళ్దామం టున్నా..." కాస్త మందలింపు, మరి కాస్త అను నయం రంగరించి గొంతులో కలుపుకునే అడిగాడు.

"ఒరే శేషాద్రీ. ఇంత మంచి అవకాశం పోగొట్టుకుంటున్నావుట్రా. మీ నాన్న నీకు ఏది యిష్టమో చెప్పమంటే నాకో రచయిత్రిని చేయ మని అడిగేయకుండా బెల్లంకొట్టిన రాయిలా ఊరుకుంటున్నా వేమిట్రా బడుద్ధాయీ" అని మనస్సు తిట్టిపోసింది.

సిగ్గుపడుతూనే "నాన్నా"అన్నాడు మెల్లిగా.

"ఏమిటినానా—" ఏమిటా అని కంగారు పడ్డాడు జగన్నాథం.

ఇంతలో సుపుత్రుడు ఏం పెటకం తెచ్చాడో అని ఆయన అదుర్దా!

"మరే... నాకు... నాకు ఎవరైనా ఓ రచ యిత్రిని పెళ్ళి చేసుకోవాలని ఉంది" అని బైట పెట్టి తన బాధ్యత అయిపోయిందనుకుని పత్రికలో ముఖం దాచుకున్నాడు కొడుకు.

ఓరి భడవా—నీ కడుపులో ఎన్ని కోరిక లున్నాయిరా నా చిట్టితండ్రీ! మరి చెప్పావు కాదే ఇంతసేపూ...అన్నట్లు చెప్పటమే మరిచా—యీపిల్ల బాగా కథలూ అవీ రాస్తుందిట! రెండు మూడు నవలలుగూడా పబ్లిషయ్యాయిట!"

"ఆ అమ్మాయి పేరేమిటి నాన్నా" దాచుకోలేని ఆతురతతోనే అడిగాడు శేషాద్రి.

"అరవిందో—ఏదో ఉంది—"

"ఆ! అరవిందే! నిజంగానే అరవింద అయితే ఆ పిల్లనే చేసుకుంటా నాన్నా" అని గారాబంగా కాస్త మొండిగా అంటూ అమాంతం లేచి కూర్చున్నాడు.

"మరి పిల్లను చూడవుట్రా" అన్నాడు ఆశ్చర్యంతో జగన్నాధరావు.

"అక్కర్లేదు నాన్నా...ఆమె రచనలు నాకు చాలా యిష్టం" అన్నాడు ధృఢనిశ్చయంతో శేషాద్రి.

ఏదొచ్చినా యీ కుర్రాళ్ళతో విడ్డూరమే అనుకున్నాడు పూర్వకాలం మనిషి జగన్నాధరావు.

అరవిందగూడా ఎందుకో వరుణ్ణి చూడాలని కోరలేదు—అందువల్ల పెళ్ళిచూపులు పెద్దల ద్వారానే జరిగిపోయాయి.

శేషాద్రీ అరవిందల వివాహం ఘనంగానే జరిగింది.

తన బాధ్యత తీరిందనుకున్నాడు జగన్నాధరావు.

తన బరువు దించుకున్నా ననుకున్నాడు ఆయన వియ్యంకుడు చంద్రమౌళి.

తన జన్మే సార్థకమయిపోయిందనుకున్నాడు శేషాద్రి.

"ఇక కొత్త సమస్యలు ప్రారంభమవుతాయి కాబోలు—" అనుకుంది రచయిత్రి అరవింద.

•   •   •

పెళ్ళి పీటలమీదా, ఊరేగింపులో అక్కడా అరవిందను ఏదో నెపంతో పలకరించా లనుకుంటూ ఏవేవో ప్రయత్నాలు చేయటం మొదలెట్టాడు శేషాద్రి...అయితే అరవింద తల ఎత్తలేదు... అతని అవస్థ గమనించినట్లే కనిపించ లేదు—నిరుత్సాహంతో క్రుంగిపోయాడు శేషాద్రి...అతని పాట అతని స్నేహితుడు ఒక్క శర్మమాత్రం వచ్చాడు. ఆమాటకొస్తే అతనికి మిత్రులు చాలా తక్కువమంది ఉన్నారు.

మర్నాటి మధ్యాహ్నం విడిదిలో శర్మా శేషాద్రీ తమ గదిలో చేరారు. "తలుపులు వేయరా శర్మా" అన్నాడు శేషాద్రి బరువుగా. అతని ఖిన్నవదనాన్ని చూచి ఏదో అయిందనుకున్నాడు శర్మ.

"ఏరా—అలా ఉన్నావేం! పెళ్ళికొడుకు ఉండవలసినంత హుషారుగా లేవేంరా!" అన్నాడు శర్మ.

"ఏమీ లేదురా" నిట్టూర్చాడు శేషాద్రి.

"అమ్మాయి నచ్చలేదా ఏం!" అలా అయి ఉండదు అనే సంశయంతో అడిగాడు శర్మ.

"నచ్చక పోవటమేం శర్మా...ఊహించుకున్న దానికంటే కూడా ఎంతో బాగుంది."

"మరి—"

"నచ్చనిదల్లా అమ్మాయి ప్రవర్తనే!" వాపోయాడు శేషాద్రి.

"ఏం-కథ..."

"మరేదో అనుకోకు. నిన్నా యీరోజూ ఎన్నిసార్లు పలకరించబోయినా తనను కానట్లు వెళ్ళిపోయిందిరా!"

"ఓస్-యింతేనా!" శర్మ కులాసాగా కిలకిలా నవ్వేశాడు.

"నీమొహం! యీ మాత్రానికేనటరా యింత బాధ......రేపటి నుంచీ యిహ వద్దన్నదాకా మాట్లాడుతుందిలే ... ఎంతైనా పెళ్ళి కూతురు కదూ—సిగ్గుపడి ఉంటుంది."

"చదువుకున్న పిల్లే గదరా...పైగా రచయిత్రి కూడానా. అంతసిగ్గు దేనికో" సందేహంగానే అడిగాడు.

'నీ తెలివి తెల్లారినట్లే ఉంది...ఎంత చదువుకుంటేమాత్రం ఆడపిల్ల'గదా! సహజమైన సిగ్గుబిడియా లేమైపోతాయనుకున్నావు! పదిమందిలో అమాంతం పలకరిస్తే ఎలా మాట్లాడుతుందిరా! చాలుచాల్లే నీవూ నీ దిగులూను...మరీ యింత వాజమ్మమయితే ఎలారా!" అన్నాడు శర్మ.

"నిజమే కాని, యింతకూ ఆమెని ఎలా ఎప్రోచ వాలో తెలియటం లేదురా. ఎలా మాట్లాడితే ఏమనుకుంటుందో—పైగా రచయిత్రికూడా. చదువు

కున్న అమ్మాయిలంటేనే భయం నాకు. అసలేమీ మాట్లాడకపోతే పట్టిదద్దమ్మ ననుకుంటుందేమో... ఎలారా?"

"పుస్తకాల్లో యిలాటి సన్నివేశాలు వర్ణిస్తూనే ఉంటారు. రెండు మూడు నవలలు చూచి ఆ సందర్భాల్లో ఎలా మాట్లాడతారో గమనించి వీరి ఆ మాటలు బట్టీపెట్టి అనేసెయ్యి."

"ఇదిట్రా—అఘోరించినట్లేఉంది నీఆలోచన—ప్చ్—ఆవిడే యిలాంటి సన్నివేశాలు ఎన్నో సృష్టించిఉంటుంది గదా. ఈ బట్టీ పెట్టినవి కనుక్కో లేదంటావా? ఇంకా అపహాస్యం పాలవుతాను గూడా-ఇవన్నీ ఏమీ చేతగాని అమ్మాయిలముందు పారతాయేమోగాని...అరవింద - సాక్షాత్తూ అరవింద ముందా!"

"గట్టిచిక్కే వచ్చిపడిందిరా-ఏమోనబ్బా-ఏరికోరి రచయిత్రే కావాలని చేసుకున్నావుగా. నీ తంటాలు నీవు పడు. నాకు తెలీదు. నేనుమాత్రం రచయిత్రిని చేసుకోను..."

"ఏడిశావులేరా.. నీ మోహాన్ని ఏ రచయిత్రి చేసుకోవచ్చిందిటా!"

"మిడిసిపడకురా...నిన్ను అరవింద వరించిందనుకుంటున్నావు మహా! పెళ్ళికొడుకువని ఊరుకుంటున్నాగాని నాలుగు తన్నేవాణ్ణి నిన్ను యీ మాటలన్నందుకు."

"సరేలేరా బాబూ...యింకో సలహా చెప్పూ!"

"నే చెప్పనుపో. నేనీ బండికే వెళ్ళిపోతున్నా" అని లేచాడు తెచ్చిపెట్టుకున్న కోపంతో శర్మ.

"వెళ్ళకురా నాన్నా...నన్నిలా అర్థాంతరంగా నట్టేట్లో వదిలివెళ్తావుట్రా నువ్వు లేకపోతే ఎవర్రా నాకిక్కడ ఆసరా...మా బంగారు తండ్రివిగా. నీకు ఏంకావలిస్తే అది యిస్తా—నాకోసం యీ రెండు రోజులూ ఉండరా బాబూ!" అని బ్రతిమాలుకున్నాడు శేషాద్రి.

"సరే... నీ వింతగా ప్రాధేయపడుతుంటే ఎందుకు కాదనాలి గనక! ఉంటాను" అని ఎంతో కష్టంమీద శేషాద్రిని ఉద్ధరించటానికే ఉన్నట్లు నటిస్తూ కూలబడ్డాడు శర్మ.

"ఏమిటి నీ రెండో సమస్య—త్వరగా చెప్పు' వరాలిచ్చే దేముడి పోజు పెట్టాడు.

"ఏం లేదుగాని—నా పేరు బాగుండలేదురా!" అన్నాడు బెంగగా శేషాద్రి.

"బాగుంది వరస...యిప్పటికి తెలిసిందా ఆ విషయం? అయినా మీ తాతగారి పేరుగా అది యిప్పుడెలా మార్చుకుంటావు? కాకపోయినా యిప్పుడు పేరుతో ఏంపనీ—శుభలేఖలు అచ్చయిపోయి వాటిపనీ ముగిసిందిగా!"

"...అదికాదు...అరవింద రాసే కథలన్నిట్లో, నవలల్లో కథానాయిక భర్తను పేరుతోనే పిలుస్తుందిగా...యిప్పుడు అరవింద నన్నేమని పిలుస్తుంది? హు! శేషాద్రిట శేషాద్రి! తలచుకుంటేనే నాకే ఒళ్ళు జలదరిస్తోందిగదా ... ఏ శేషగిరన్నా అయితే 'గిరి' అని అయినా పిలిచేదేమో!"

"పోనీ 'శేషూ' అని పిలవమను."

"శేషూ అంటే బ్రహ్మా అన్నట్లుగా ఉంటుందిరా—సరే ఎలా అవాల్సుంటే అలా అవుతుంది. పోతే యిహ మూడో సందేహ మేమిటంటే—అరవింద అభిరుచులకు తగ్గట్టు అలంకరించుకుని ఆమెను సమీపిస్తే బాగుంటుందేమోనని ఉంది—దీనికేమంటావు?"

"నిక్షేపంలా ఉందటాను—ఇంత గొప్ప ఐడియా తట్టినందుకు నిన్ను అభినందించకుండా ఉండలేను 'శేషూ'—మరి ఆమె అభిరుచులెలా తెలియటం?"

"హుఁ నేనంత తెలివితక్కువి వాణ్ణా ఏం- ఆమె వ్రాసిన నవలలూ కథల సంపుటాలూ అన్నీ పుచ్చుకునే వచ్చాను. అది చదువుకుని వాటి ప్రకారం మేకప్ చేసుకుంటా. తెలిసిందా?" సగర్వంగా అనేశాడు శేషాద్రి.

"అమోఘం - అద్భుతం - నోబెల్ ప్రైజ్ యిప్పించొచ్చు నీకు" అని కొంటెగా నవ్వుతూ పరచి ఉన్న బెడ్డింగుమీద పడుకుని ఆటూయిటూ దొర్లాడు శర్మ.

• • •

పడకగదిలో కిటికీదగ్గర నిలువబడి చువ్వల్లోంచి నీలాలనింగివైపు చూస్తూ చందమామ అందాన్ని తిలకిస్తోంది అరవింద... ఈ చంద్రకాంతి తనలో జ్ఞాపకాల గాయాలను రేపి హృదయాన్ని బాధిస్తోంది. తన జీవితంలో యీ రోజు మధురాతిమధురం అయిపోతుందని కలలు కన్నది. కలలు కలలేగాని నిజమెలా అవుతాయి! బాధాపూరిత

మైన గతాన్ని ఎలాగైనా విస్మరించాలనే వ్యర్థ సంకల్పంతో యీ వివాహానికి అంగీకరించింది. అతను కానప్పుడు ఎవరైతే ఏంలెమ్మని చూడకుండానే ఒప్పుకుంది. తన హృదయ దౌర్బల్యం కాకపోతే అతణ్ణి గురించిన ఊహ వచ్చినప్పుడల్లా కళ్ళు నీళ్ళతో నిండుతాయేమో. ఆ కన్నీటిలోనే ఏదో తృప్తి. విఫలమైన ప్రేమా ఒకరకంగా మధురంగానే ఉంటుంది కాబోలు. దూరమైపోయిన ప్రియతముని తలచుకుని హృదయం ఆక్రందన చేయటమూ మానసికానందాన్ని ప్రసాదిస్తుందేమో!

భుజంమీద చెయ్యి బరువుగా పడింది. వెంటనే తన కళ్ళు మూశారెవరో! ఎవరో ఎందుకవుతారు. తన రసికత్వం చూపించుకుని తన అనురాగానికి శాశ్వతంగా పాత్రుడవాలని కోరుకునే వ్యక్తి. రాత్రి తాళికట్టిన తన భర్తే...! విరక్తిగా నవ్వుకుంది నిర్జీవంగా—ఆ నవ్వులో సౌరభం లేదు. మెల్లిగా చేతులు విడిపించుకుంది. అతని రెండు చేతులకు అరవింద కన్నీరు తగిలింది. విస్మయంతో ఆమె ముందుకు వెళ్ళి, "నామీద కోపమా, అరవిందా?" అని అడిగాడు శేషాద్రి.

"ఏ పరిచయమూ లేని యితనిమీద కోపము ఏమిటి!"అని అనుకుంటూ మళ్ళా శుష్కహాసం చేసి, "ఎందుకండీ మీామీద కోపం?" అని ఎదురు ప్రశ్న వేసింది అరవిందం. చక్కని బ్రిల్ క్రీమ్ వాసనలు గది అంతా అలుముకున్నాయి. అరవింద హృదయం ఒక్కసారి భగ్గుమంది... జ్ఞాపకాలు పెట్టేటంత బాధ మరేజబ్బుకూడా పెట్టలేదేమో! చెప్పుకోటానికి వీలులేని— వ్యక్తం చేయటానికీ సాధ్యంకాని బాధ అది. ఏ వ్యక్తిని తాను మరచిపోవాలని విశ్వప్రయత్నం చేస్తోందో ఆ వ్యక్తినే జ్ఞప్తికి తెచ్చే పరిమళాలూ, దుస్తులూ తన ఎదురుగుండా తారసిల్లితే తానెలా భరించగలదు?...అరవింద శేషాద్రికేసి అపాదమస్తకం చూచి భరించలేక కళ్ళు మూసుకుంది.

డాక్టరుగారు కాస్త కంగారుపడ్డాడు. ఒకసారి తనవైపు తాను చూసుకున్నాడు. వోపవీటు కలర్ సిల్కుమీద చక్కని సన్న నల్ల గడి ఉన్న ఫుల్ హేండ్ వోపెన్‌షర్టు తొడుక్కుని చేతులు సగందాకా పైకి మడుచుకున్నాడు. తెల్లని పైజమా వేసుకున్నాడు. ఇవన్నీ ఆమె వర్ణించినవేగా. బ్రిల్ క్రీమ్ ఆమెకు యిష్టమని గ్రహించి అదే రాసుకుని వచ్చాడు...అసలు తను మాట్లాడిన విధానం సరిగ్గా లేదేమో.

"అరవిందా?అలావున్నావేం"? అన్నాడు ఆమె పక్క కుర్చీలో కూలబడుతూ.


# ఓవర్‌సీర్ కోర్సు

ఎస్.ఎస్.ఎల్.సి. అభ్యర్థులు(ప్యాసైనా, కొన్ని మార్కులు తక్కువవచ్చి తప్పినా) ఈ కోర్సుకు నేరుగాగాని, పోస్టల్ ద్వారాగాని చేరవచ్చును.కాంపోజిట్ మాథమాటిక్సు అవసరంలేదు.

సివిల్ యింజనీరింగులో 1957 ఏప్రిల్‌లోజరుగు మద్రాసు అండ్ ఆంధ్ర గవర్నమెంటు పరీక్షలకు విద్యార్థులు తయారు చేయబడుదురు. పోస్టల్ విద్యార్థులకుకూడా ప్రాక్టికల్ ట్రెయినింగు ఇవ్వబడును. హాస్టల్ కలదు.

ప్రాస్పెక్టసుకు, దరఖాస్తు ఫారముకు ఒక రూపాయి మణిఆర్డరుద్వారా ప్రిన్సిపాల్, మద్రాస్ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్, 97 స్వామినాయక్ వీధి, చింతాద్రిపేట, మద్రాసు-2. అడ్రెసుకు పంపండి. ఎం.ఓ. కూపనులో మీా పేరు, అడ్రెసు విడి విడి అక్షరాలతో వ్రాయండి.

సి. జి. బిందు మాధవరావు, బి.ఎస్‌సి.,బి.ఇ.,ఏ.ఎం.ఐ.ఇ. (ఇండియా) ప్రిన్సిపాల్.

కాలేజి ప్రారంభం **25-6-56** తేదీ

అంచరికీ అలాంటి సున్నితమైన పరిస్థితుల్లో పడ్డట్టే ఆమెకీ కంట్లో నలుసుపడింది.

"ఏం లేదండీ...కంట్లో ఏదో నలుసుపడ్డట్టుంది. పైగా వచ్చేపోయే వాళ్ళతో పగలంతా విశ్రాంతే లేదుగదూ...అందుకని అలసటకు ఏమిటో ఒళ్ళు తిప్పినట్లుగా ఉంది-అంతే" అంది.

"పోనీ ఫేన్ వేస్తానుండు—" అని శేషాద్రి ఫేన్ స్విచ్ వేసి ఆమెవైపు తిప్పాడు.

"కాసిని చల్లని మంచినీళ్ళు తాగుతావా" అంటూనే కూజాలోంచి నీళ్ళువంచి గ్లాసు ఆమెకు అందించాడు.

ఇతని హృదయం మంచిదేగాని అలంకరణే తనను బాధిస్తోంది అనుకుంది అరవింద ... ఆ డ్రెస్ తన రజనీకాంత్ వేసుకుంటేనే తనకు ఇష్టం. అలాంటి సమయాల్లో ప్రేరేపించబడేగా తన రచనల్లో నాయకుణ్ణి వర్ణించేది-తన కథలను యిన్స్పిరేషన్ అతనేగా...అసలు అతను వాడటాన్నే బ్రిల్ క్రీమ్ వాసన తనకంత ప్రీతిపాత్రమైందేమో-అతనే దూరమైనాడు గాని తన హృదయంలో గాయాలను రేపే సాధనాలు మాత్రంగానే తయారయ్యాయి...రజని ఎక్కడ? యీ శేషాద్రి ఎక్కడ?...నవ్వుకుంది మళ్ళీ పైకి కనిపించకుండా.

"నీ రచనలంటే నాకెంతో యిష్టం అరవిందా! ఎంత బాగా రాస్తావు!" నీ వంటిదానికి నే నసలు తగనేమో నేనూ రచయిత నవాలనుకున్నానుగాని సాధ్యంకా లేదు."

"అలాగాండి..." శేషాద్రికేసి సానుభూతితో నిశితంగా చూచింది...ఒక్క చూపులోనే అతనికి తనపై ఎంత గాఢమైన ప్రేమాభిమానాలు, గౌరవం ఉన్నాయో గ్రహించింది అరవింద...పెద్ద అందగాడు కాకపోయినా ప్రమాదకరమైన మనిషి మాత్రం కాదని నిర్ణయించుకుంది.

"అరవిందా! నీ కథల్లోలాగా నన్ను పేరుపెట్టి పిలవరాదూ - ఇలా ఏమండీ అనకపోతే"అన్నాడు అమాయకంగా.

"ఎందుకండీ...పోనీ...ఏమని పిలవమంటారు?" అంది అరవింద సన్నగా నవ్వుతూ.

"ఏమో...కానీ నీ పేరులా నా పేరు అందమైది కాదుగా...నీ యిష్టంవచ్చిన పేరుపెట్టు."

"సరేలెండి—తీరిగ్గా ఆలోచిద్దాం...అయితే మీకు బ్రిల్ క్రీమ్ చాలా యిష్టమా?"

"ఉహూ—నేనెప్పుడూ కొబ్బరినూనె వాడతాను. నీకు బ్రిల్ క్రీమ్ యిష్టమని యీరోజే రాసుకున్నాను."

"అదేమిటి! నాకు యిష్టమని ఎవరన్నారు?" విస్తుబోయింది అరవింద. "నాకు తెలీదనుకున్నావా దొంగా—నీ రచనలన్నీ కనిగట్టుకుని మళ్ళా చదివాను. నీవు ఎంతో యిష్టంగా వర్ణించిన యీ డ్రెస్ కూడా సాయంత్రం డ్రెస్ హాలులో కొనుక్కుని వస్తూ వస్తూ బ్రిల్ క్రీము కూడా తెచ్చుకుని వచ్చాను ..." అన్నాడు పెద్ద యోధుడిలా శేషాద్రి.

"చంపేశారండీ! ఏదో కథల్లో ఆ సందర్భానికి అలా వర్ణించాను గాని నాకు యివన్నీ యిష్టం అనుకున్నారా? కథల్లో తడవ కొకటి వర్ణిస్తూ ఉంటాము. అవన్నీ నాకు సంబంధించిన వేఅనుకుంటే ఎలా? చూడండీ...నాకు నిజంగా కొబ్బరినూనె అంటేనే ఎంతో యిష్టం—అలాగే యీ వోవల్టీను కలర్ అంటే అసలు గిట్టదు...తెలిసిందా?" అంది గోముగా అరవింద.

"అయ్యో—నీకు ఎంతో యిష్టం అనుకున్నా అరవిందా! సరే యింకెప్పుడూ యివి వాడను." అని పశ్చాత్తాప పడుతున్నట్లు ముఖంపెట్టిన శేషాద్రిని చూస్తే అరవిందకు ఎంతో జాలేసింది...తన హృదయాన్ని ముక్కలుచేసి పోయిన రజనికంటే ఎన్నో రెట్లు అధికుడిలా యీ క్షణాలో యితడు కనిపించాడామెకు...తల్లిలేని యీ అమాయకుణ్ణి, తన్నో దేవతలా ఆరాధిస్తున్న యీ వ్యక్తిని, ఆదరించి లాలించే భారం యీ క్షణంనుంచీ తనదేనని పించింది. బట్టలు మార్చుకోటానికి శేషాద్రి బైటికి వెళ్ళిపోయాడు "నా కర్తవ్య పథంలోంచి నేను తప్పిపోకుండా రక్షించి కావలసిన శక్తినియ్యి ప్రభూ" అని దీనాతి దీనయై భగవంతుని ధ్యానించింది అరవింద.

• • •

మరునాటి ఉదయం పాలేరుకు ఆ పైజామా, షర్టు నజరానాగా యిచ్చేశాడు అరవింద భర్త శేషాద్రి.

★